సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 3 । మే । 2023



మహా కుంభాభిషేక పూజలు

జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో మహా కుంభాభిషేక వేడుకలను మంగళ వారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,070
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,574
3 శాతం జీఎస్టీతో	రూ.5,741
సవర (8 గ్రా)	రూ.45,928

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /26.4

జిల్లాలో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. మంగళవారం గాలిలో 69 శాతం తేమ ఉంది. బుధవారం వర్షం కురిసే అవకాశ ముంది.

న్యూస్‌రీల్

న్యాయమూర్తికి కలెక్టర్ ఘన స్వాగతం



న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.రాజాకు కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సత్యవాణి నెల్లూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఘన స్వాగతం పలికారు. తొలుత రాజా పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మొబైల్ కోర్టు జడ్జి లావణ్య, నెల్లూరు ఆర్డీఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

2,86,185 మందికి పెన్షన్ల అందజేత



తిరుపాలుకు నగదు అందజేస్తున్న వలంటీర్

నెల్లూరు(పొగతోట): జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 3,06,799 మందికి గానూ మంగళవారం నాటికి 2,86,185 మందికి నగదు అందజేశారు. దీంతో 93.28 శాతంగా నమోదైంది.

ఆస్పత్రికి వెళ్లి..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరులోని 53వ డివిజన్ పరిధి గాంధీ గిరిజన కాలనీకి చెందిన ఏలూరు తిరుపాలు అనే వృద్ధుడు కేన్సర్‌తో బాధపడుతున్నాడు. అతను పొదలకూరురోడ్డు లోని క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా డు. ఆ వార్డులోని వలంటీర్ శ్రావణి సదరు ఆస్పత్రికి వెళ్లి తిరుపాలుకు పింఛన్ అందజేసింది.

ప్రైవేట్ స్కూళ్లలో ప్రవేశానికి రెండో విడత దరఖాస్తులు

నెల్లూరు(టౌన్): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 5 నుంచి 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ గంగాభవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడతలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు లాటరీ పద్ధతిలో ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశం కల్పించినట్లు తెలిపారు. తొలి విడతలో 25 శాతం రిజర్వేషన్ కన్నా తక్కువ స్థాయిలో దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. cse.ap.gov.in వెబ్‌సైట్‌లో విద్యార్థులు తమ వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. అర్హత గల విద్యార్థులకు అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచితంగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు.

సైబర్ నేరగాళ్ల వలలో ప్రభుత్వ ఉద్యోగి

సంగం: ఓ ప్రభుత్వ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి రూ.లక్షలు పోగొట్టుకున్న ఘటన సంగంలో మంగళవారం వెలుగు చూసింది. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులోని వివరాల మేరకు.. సంగం తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఫోన్‌కు ఓ రోజు 30 నిమిషాల్లో లోన్ పొందడం ఎలా వీడియో వచ్చింది. అది చూసిన అతను యాప్‌ని డౌన్లోడ్ చేశాడు. కాసేపటికి ఇండియా బుల్స్ కన్స్యూమర్ ఫైనాన్స్ పేరుతో ఓ వ్యక్తి ఉద్యోగితో మాట్లాడాడు. చాటింగ్ ద్వారా వివరాలు తెలిపాడు. కొంత నగదు చెల్లిస్తే ఎటువంటి పత్రాలు లేకపోయినా లోన్ అందజేస్తామని గత నెల 3వ తేదీన వారి నుంచి సమాచారం వచ్చింది. 5.99 శాతం వడ్డీపై తొలుత రూ.10 లక్షలు ఇస్తామని చెప్పాడు. దీంతో కొంత నగదు వారికి ఇచ్చాడు. ఆ తర్వాత రూ.10 లక్షలు జమ అవడంలో టెక్నికల్ ఇబ్బందులు ఉన్నాయంటూ ఆర్‌బీఐ పేరుతో ఫేక్ లెటర్ పంపాడు. అది నమ్మిన ఉద్యోగి సదరు వ్యక్తి చెప్పిన మేరకు 4న రూ.6,500, 6, 7 తేదీల్లో రూ.2.61 లక్షలు ఇచ్చాడు. తర్వాత ఆ వ్యక్తి నుంచి ఎటువంటి సమాధానం ఇవ్వకపోవడంతో ఉద్యోగి తాను చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని కోరాడు. రూ.22 వేలు చెల్లిస్తే మొత్తాన్ని తిరిగి ఇస్తామని మరో మెసేజ్ రావడంతో నగదు చెల్లించాడు. చివరికి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గ్రహించి నాలుగురోజుల క్రితం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లాభాల పంట

ఈ ఏడాది పొగాకు పంటకు నాణ్యతతో సంబంధం లేకుండా వేలంలో మంచి ధరలు వస్తున్నాయి. రైతులు పండించిన పొగాకుకు ప్రస్తుతం మార్కెట్‌లో ఊహించని ధర లభిస్తోంది. వేలంలో బ్రైట్, లో గ్రేడ్ అనే తేడా లేకుండా అన్ని ఉత్పత్తులకు దాదాపుగా సమాన ధర పలుకుతోంది. కేజీ పొగాకుకు సరాసరి ధర రూ.195గా నమోదు కావడమే ఇందుకు నిదర్శనం. వేలం చివరి రోజుల్లో ఈ ధరలు మరింత పెరుగుతాయనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.



కందుకూరు పొగాకు వేలం కేంద్రంలో వేలానికి వచ్చిన పొగాకు బేళ్లు

రైతులకు సిరులు కురిపిస్తున్న పొగాకు

- బ్రైట్ గ్రేడ్ రకాలతో సమానంగా లో గ్రేడ్ ఉత్పత్తులకు ధరలు
- కేజీ పొగాకు సరాసరి ధర రూ.195గా నమోదు
- డిమాండ్ ఉండడంతో ఆశాజనకంగా రేట్లు

కందుకూరు: ఈ ఏడాది మార్చి 9వ తేదీ నుంచి జిల్లాలోని కందుకూరు–1, కందుకూరు–2, కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాల్లో అధికారికంగా వేలం ప్రక్రియ ప్రారంభమైంది. అప్పటి నుంచి ఈ ఇది కొనసాగుతోంది. అయితే సాగు ఖర్చులు పెరగడం, మాండూస్ తుపాను వల్ల రైతులు పంట నష్టం వంటి పరిణామాలు ఎదుర్కొన్న నేపథ్యంలో ఈ ఏడాది గిట్టుబాటు ధరలు వస్తేనే నష్టాల నుంచి బయటపడతామంటూ వేలం ప్రారంభానికి ముందు నుంచే డిమాండ్‌ను గమనిస్తూ వచ్చారు. దీనికి అనుగుణంగానే అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా పొగాకు ఉత్పత్తులకు డిమాండ్ రావడంతో రైతులు పండించిన పొగాకుకు ప్రస్తుతం ఆశించిన విధంగానే ధరలు వస్తున్నాయి. ఇప్పటివరకు దాదాపు నెలా ఇరవై రోజులపాటు జరిగిన వేలంలో కేజీ పొగాకుకు అత్యధిక ధర రూ.200 లభించింది. వేలం ప్రారంభం నుంచి గరిష్ఠ ధరల్లో ఎలాంటి మార్పు లేకపోయినా లో గ్రేడ్ ఉత్పత్తులకు బ్రైట్ గ్రేడ్ ఉత్పత్తులతో సమానంగా ధరలు రావడమే ఇక్కడ చెప్పుకోదగిన పరిణామం. సాధారణంగా గ్రేడ్–1 పొగాకుతో సమానంగా లో గ్రేడ్ పొగాకుకు ధరలు వచ్చిన సందర్భాలు గతంలో ఎప్పుడూ లేవు. ప్రస్తుతం వేలంలో గ్రేడ్–1 పొగాకు కేజీ ధర రూ.200 పలుకుతుంటే మాడు పొగాకు అంటే లో గ్రేడ్ కేజీ రూ.195 వరకు పలుకుతోంది. జిల్లాలోని నాలుగు వేలం కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. అన్ని ఉత్పత్తులకు దాదాపు సమాన ధరలు వస్తుండడంతో కేజీ పొగాకు సరాసరి ధర కూడా రూ.195 వరకు నమోదవుతోంది. దీంతో ఈ ఏడాది పొగాకు రైతులకు నాణ్యతతో సంబంధం లేకుండా మంచి ధరలు వేలంలో వస్తున్నాయి. వేలం చివరి రోజుల్లో ఈ ధరలు మరింత పెరుగుతాయనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

13.54 మిలియన్ కేజీల కొనుగోలు

జిల్లాలో నాలుగు వేలం కేంద్రాల్లో ఇప్పటివరకు 13.54 మిలియన్ కేజీల పొగాకును వ్యాపారులు కొనుగోలు చేశారు. వీటిలో కందుకూరు–1లో 3.65 మిలియన్ కేజీలు, కందుకూరు–2లో 3.59, కలిగిరిలో 2.68, డీసీపల్లిలో 3.62 మిలియన్ కేజీల పొగాకు అమ్మకాలు జరిగాయి. అన్ని వేలం కేంద్రాల్లోనూ గరిష్ఠ ధర రూ.200 వరకు నమోదు కాగా, సరాసరి కనిష్ఠ ధర మాత్రం రూ.160గా ఉంది. ఇక సరాసరి ధరలు కందుకూరు రెండు వేలం కేంద్రాల్లో కిలోకు రూ.195 పైగా నమోదు కాగా, కలిగిరిలో రూ.193, డీసీపల్లిలో అత్యధికంగా రూ.196 నమోదైంది.

అపరాధ రుసుము తొలగించాలి

ఈ ఏడాది తుపాన్ల వల్ల పొగాకు రైతులు నష్టపోయిన నేపథ్యంలో బోర్డు అనుమతికి మించి పండించిన పొగాకుపై విధించే అపరాధ రుసుమును తొలగించాలని రైతులు డిమాండ్ కోరుతున్నారు. దీని వల్ల రైతులకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని కోరుతున్నారు. ఈ మేరకు రైతు సంఘాల నాయకులు బోర్డు ఉన్నతాధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. గతంలో కర్ణాటక పొగాకు మార్కెట్‌లో అపరాధ రుసుము తొలగించారని, అదే విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో..	
పొగాకు వేలం కేంద్రాలు – 4	ఇప్పటివరకు విక్రయించిన పొగాకు – 13.54 మిలియన్ కిలోలు

మంచి రేట్లు వస్తున్నాయి



ఈ ఏడాది పొగాకు వేలంలో అన్ని రకాల పొగాకుకు మంచి రేట్లు ఇస్తున్నారు. లోగ్రేడ్ పొగాకు కూడా బ్రైట్ గ్రేడ్ పొగాకుతో సమానంగా ధరలు ఇస్తున్నారు.
– అనుమోలు రాములు, పొగాకు రైతు

రైతులకు మేలు



పొగాకు మార్కెట్ బాగుండడం వల్ల రైతులకు మంచి ధరలు వస్తున్నాయి. అన్ని రకాల పొగాకుకు సరాసరి ధరలు బాగుండడం వల్ల రైతులు సంతోషంగా ఉన్నారు. పెనాల్టీ తొలగిస్తే రైతులకు ఇంకా మేలు జరుగుతుంది.
– సోమానాయుడు, పొగాకు రైతు

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా వ్యాప్తంగా పలువురు డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ఎం.హరినారాయణన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అల్లూరు డీటీ చెంచయ్యను దగదర్తికి, అక్కడ పనిచేస్తున్న గీతను కావలి ఎన్నికల డీటీగా, ఆ స్థానంలో ఉన్న డీటీ నాగలక్ష్మి అల్లూరుకు బదిలీ చేశారు. సెలవులో ఉన్న పవన్‌ను రాపూరు రీ సర్వే డీటీగా, ముత్తుకూరు డీటీ సునీల్‌ను రాపూరు డీటీగా, నెల్లూరు రూరల్ ఎన్నికల డీటీ అనురాధను పొదలకూరు రీ సర్వే డీటీగా, ఆ స్థానంలో ఉన్న ఆషర్‌ను నెల్లూరు రూరల్ ఎన్నికల డీటీగా నియమించారు.

8 నుంచి వేసవి క్రీడా శిబిరాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ సంవత్సరం వేసవి క్రీడా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు సెట్నెల్, డీఎస్ఏ సీఈఓ డి.పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ, నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌తో కలిపి మొత్తం 53 కేంద్రాల్లో 27 క్రీడాంశాల్లో శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 8 నుంచి జూన్ 10వ తేదీ వరకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తారన్నారు. 8 నుంచి 16 సంవత్సరాల్లోపు వయసున్న బాలబాలికలు దీనికి అర్హులని తెలియజేశారు. శిబిరాలు పూర్తయిన తర్వాత వారికి ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించి భవిష్యత్‌లో వారికి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, ఆయా సంఘాల ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తామన్నారు. ఇతర వివరాలకు 98499 09074 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విత్తనాలు అందుబాటులో ఉంచాలి



అధికారులతో మాట్లాడుతున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): వ్యవసాయ సీజన్ నేపథ్యంలో జిల్లాలోని రైతులకు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వివిధ పథకాల అమలు గురించి ఆరాతీశారు. వ్యవసాయ యాంత్రీకరణ, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల లభ్యత తదితర అంశాలను ఆరాతీశారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో రైతులకు లబ్ధి చేకూరేలా వ్యవసాయాధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్ రాజు, డీడీలు, ఏడీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులను ప్రోత్సహించాలి

జిల్లాలో సువిశాల తీర ప్రాంతం, సారవంతమైన భూములున్న నేపథ్యంలో సంప్రదాయేతర పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లో మత్స్య శాఖ, ఉద్యాన శాఖపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మత్స్యకార భరోసా లబ్ధిదారుల గురించి అధికారులు వివరించారు. సూక్ష్మ సాగునీటి ప్రాజెక్టుల అమలు తీరుతెన్నులను ఆరాతీశారు. అరటి, కూరగాయల వంటి పంటలు వేస్తే రైతులకు తక్షణ ఆదాయం లభిస్తుందన్నారు. ప్రజల జీవన విధానంలో గణనీయమైన మార్పులు వస్తున్నాయని, ఆరోగ్యవంతమైన ఆహారం వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ క్రమంలో రైతులను ఆయా పంటల సాగు వైపు ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, ఫిషరీస్ జేడీ నాగేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా స్వచ్ఛ సంకల్పం

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన జెడ్పీ సీఈఓ చిరంజీవితో కలిసి పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అంతర్గత రోడ్లు, కాలువలు తదితర పనులను చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సమన్వయంతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు.

సోమశిలలో 50.704 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 50.704 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 195 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా ఉత్తర కాలువకు 350 క్యూసెక్కులు, కండలేరుకు 300, పెన్నార్ డెల్టాకు 2,750 , దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి మట్టం 96.411 మీటర్లు ఉంది.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



శేషవాహనంపై స్వామి, అమ్మవార్లు

- వైభవంగా ధ్వజారోహణం
- శేషవాహనంపై విహరించిన నృసింహుడు



ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని గరుడుడి ద్వారా సకలదేవతలకు అర్చకులు ఆహ్వానం పంపారు. ఉదయం 5 గంటలకు దేవదేవేరులకు ఉభయదాతలు పట్టువస్త్రాలు సమర్పించారు. తర్వాత ప్రత్యేక పూలంగిసేవ జరిపారు. 8 గంటలకు గరుత్మంతుడి చిత్రంతో కూడిన వస్త్రాన్ని (తెల్లటి వస్త్రంపై పసుపు, గంధం, కుంకుమతో ప్రత్యేకంగా గరుత్మంతుని చిత్రాన్ని చిత్రీకరించింది) తిరుచ్చి పీఠంపై కొలువుదీర్చి ఆలయంలో గిరిప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా తిరుచ్చిపై కొలువుదీర్చిన స్వామి కోన మాడ వీధుల్లో ఊరేగుతూ ధ్వజస్తంభం వద్దకు చేరుకున్నారు. అర్చకులు గరుత్మంతుడి చిత్రంతో కూడిన వస్త్రానికి పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజస్తంభం పైకి ఎగురవేసి సకలదేవతలకు ఆహ్వానం పలుకుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, ఈఓ జనార్దనరెడ్డి, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి, టీటీడీ పాంచరాత్ర ఆగమపండితులు రామానుజాచార్యులు పాల్గొన్నారు.

కొడిముద్దల కోసం పోటీ

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో జరిగే ధ్వజారోహణానికి ఎంతో విశిష్టత ఉంది. గరుత్మంతుడికి పూజలు, అభిషేకాలకు ఉపయోగించిన ప్రసాదాలను స్వీకరిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఇందులో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకుని కొడిముద్దల కోసం పోటీ పడ్డారు.



సాంస్కృతిక ప్రదర్శన

స్నపన తిరుమంజనం

స్వామి, అమ్మవార్లకు మధ్యాహ్నం స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిని తిరుచ్చిలో కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. 1,008 దీపాలు సహస్ర దీపాలంకరణ మండపంలో ఉంచి ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లు శేషవాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 6 గంటలకు పూలంగిసేవ, 8 గంటలకు హంస వాహనసేవ, మధ్యాహ్నం 11.50 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకారసేవ నిర్వహించనున్నారు. రాత్రి బంగారు హనుమంత వాహనంపై శ్రీవారి క్షేత్రోత్సవం జరుగుతుందని అధికారులు తెలిపారు.

మేం ఇక్కడే ఉంటాం

సమగ్ర శిక్షలో కొంత కాలం పనిచేస్తే చాలు బాగా సంపాదించవచ్చు. జిల్లా విద్యాశాఖలో ఎక్కువగా వినిపించే మాట ఇది. ఆ శాఖలో రూ.వందల కోట్లతో పనులు జరుగుతుంటాయి. ఇందుకే డెప్యుటేషన్ పద్ధతిలో పనిచేసేందుకు అనేకమంది పోటీ పడుతుంటారు. అలా వచ్చిన వారు అక్రమాలకు తెరలేపి దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా అందిన కాడికి దోచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు సమగ్ర శిక్ష ప్రక్షాళనపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

- సమగ్ర శిక్షలో ఇష్టారాజ్యం
- డెప్యుటేషన్‌పై వస్తారు.. తిరిగి వెళ్లరు
- అక్రమ సంపాదనే లక్ష్యం
- బిల్లుల మంజూరులో నిబంధనలకు తూట్లు
- విధులకు సక్రమంగా హాజరుకాకుండానే జీతాలు

నెల్లూరు(టౌన్): సమగ్ర శిక్షకు డెప్యుటేషన్‌పై వచ్చిన వారు తిరిగి వెళ్లేందుకు ఏ మాత్రం ఇష్టపడరు. సిఫార్సులు లేదా డబ్బు సమర్పించి ఇక్కడికి వచ్చేందుకు పోటీ పడుతుంటారు. ప్రధానంగా వివిధ అభివృద్ధి పనులు జరుగుతుండటంతో అవసరం లేకున్నా ఉద్యోగుల కొరత పేరుతో డెప్యుటేషన్‌పై వస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ఈ శాఖకు వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రస్తుతం సమగ్ర శిక్షలో మొత్తం ఏడుగురు ఉద్యోగులు డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నట్లు తెలిసింది. వీరితోపాటు మరికొందరు కూడా ఉన్నట్లు సమాచారం. వాస్తవంగా ఏప్రిల్ 30వ తేదీన డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఉద్యోగులందరూ తమ పాఠశాలల్లో చేరాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. అయినా వారు ఆ శాఖ ఉన్నతాధికారి కనుసన్నల్లో మెలుగుతూ ఇక్కడే ఉండేందుకు పావులు కదుపుతున్నారన్న ఆరోపణలున్నాయి. డెప్యుటేషన్‌పై వచ్చిన ఓ ఉపాధ్యాయుడు మూడు సంవత్సరాలుగా సమగ్ర శిక్షలోనే వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని చెబుతున్నారు.

హాజరుతో పనిలేదు

ఆయా పాఠశాలల నుంచి డెప్యుటేషన్లపై వచ్చిన ఉద్యోగుల అటెండెన్స్‌ను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సమగ్ర శిక్షకు వచ్చిన ఉద్యోగుల అటెండెన్స్‌ను ఏ రోజుకా రోజు వారి మాతృ పాఠశాలకు పంపించాల్సి ఉంది. అక్కడి నుంచే నెలవారీ జీతాలు డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. అయితే కొందరు విధులకు హాజరు కాకుండానే.. తర్వాత ఒక్కసారిగా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నారని తెలిసింది. అటెండెన్స్ రిజిస్టర్‌లో ఎక్కడా దిద్దకూడదు. అయితే సమగ్ర శిక్ష అటెండెన్స్‌లో ఎక్కువగా దిద్దుబాట్లు ఉంటున్నాయని ఆరోపణలున్నాయి. ఇక్కడ పనిచేసే ఉన్నతాధికారి అండదండలతోనే ఇలా జరుగుతోందని ఆ శాఖ సిబ్బంది చెబుతున్న మాట.


Rs 14,000
Rupees FOURTEEN Thousand Only
Co-ordinator
Samagra Siksha
SPSR Nellore DT
Additional Project Co-ordinator
Samagra Shiksha
SPS Nellore District

బిల్లుపై ఐఈ కో–ఆర్డినేటర్ బదులు వేరే వారి సంతకం ఉన్న దృశ్యం

ఒకరి బదులు ఒకరు

సమగ్ర శిక్షలో ఉన్నతాధికారి అండదండలతో కొందరు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 2021 సంవత్సరం డిసెంబర్ 4వ తేదీన ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ (ఐఈ) కో–ఆర్డినేటర్‌గా ఒకరు ఫారిన్ సర్వీస్ మీద విధుల్లో చేరారు. అదే 16వ తేదీన ఐఈ విభాగం ఆధ్వర్యంలో నెల్లూరులోని ఎమ్మార్సీలో మెడికల్ అసెస్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందుకు సంబంధించి రూ.1.50 లక్షల ఖర్చు అయినట్లు లెక్కలు చూపించారు. సాధారణంగా బిల్లులు ఆ సెక్షన్ సూపరింటెండెంట్, అధికారి సంతకం చేసిన తర్వాత సమగ్ర శిక్ష ఏపీసీ (అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్)కి పంపిస్తారు. అక్కడ ఆ అధికారి పరిశీలించి సంతకం పెట్టాక బిల్లు పాస్ అవుతుంది. అయితే ఈ బిల్లుపై ఐఈ విభాగం సూపరింటెండెంట్, కో–ఆర్డినేటర్ సంతకం లేకుండానే పాస్ చేశారు. ఏ విధంగా పాస్ చేశారన్న దానిపై పరిశీలిస్తే ఆ బిల్లులపై నాడు–నేడు పేరుతో పర్యవేక్షణకు డెప్యుటేషన్‌పై వచ్చిన ఓ అధికారి ఈ ఏడాది జనవరి 23వ తేదీన సంతకం చేసినట్లు ఉంది. దీంతో ఈ బిల్లులపై ఏపీసీ సంతకం కూడా చేసి పాస్ చేశారని ఉద్యోగులు చెబుతున్నారు. ఇంకా భవిత సెంటర్లు ఐఆర్పీల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇలాంటివి ఈ ఒక్క సెక్షన్‌లోనే కాదు సీఎంఓ, ఏఎంఓ విభాగాల్లో కూడా జరిగినట్లు ప్రచారం ఉంది. ఇంకా కొన్ని విభాగాల్లో పనులు చేయకుండా, కార్యక్రమాలు నిర్వహించకుండానే నకిలీ బిల్లులు పెట్టి నగదు డ్రా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.



పరిశీలించి చర్యలు తీసుకుంటాం

మెడికల్ అసెస్‌మెంట్ బిల్లును పరిశీలించి ఆ బిల్లుపై వేరే వారి సంతకం ఉంటే ఆ సెక్షన్ సూపరింటెండెంట్‌కు తక్షణమే మెమో జారీ చేస్తాం. పనులు జరుగుతున్నందున వారు డెప్యుటేషన్లలో కొనసాగుతున్నారు. అటెండెన్స్ విషయంలో రోజూ హాజరును వారి మాతృ పాఠశాలలకు ఎపంపించాలని సూపరింటెండెంట్‌కు ఇప్పటికే చెప్పాను. ఈ విషయాలపై తప్పకుండా పరిశీలించి తప్పులు జరిగితే చర్యలు తీసుకుంటాం.
– ఉషారాణి, ఏపీసీ, సమగ్ర శిక్ష

క్లుప్తంగా

పేదల సంక్షేమమే ధ్యేయం

నెల్లూరు(దర్గామిట్ట): పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో 2023–24 ప్రభుత్వ వార్షిక సంక్షేమ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ వార్షిక కార్యక్రమాలతో కూడిన క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. నవరత్నాల ద్వారా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిరంజీవిగౌడ్, వైస్ ఎంపీపీ పోలిరెడ్డి చిన్నపరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంగౌడ్, అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

- జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్



సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న జేసీ కూర్మనాథ్, ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: పట్టణంలో ఈ నెల 12వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటిస్తారని, దీనికి సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఏర్పాట్లను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి జేసీ మంగళవారం పరిశీలించారు. హెలీప్యాడ్ ఏర్పాటు కోసం స్థానిక తుమ్మలపెంట రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాల, జేబీ కళాశాల క్రీడా మైదానాలను, బహిరంగ సభ నిర్వహించనున్న ఉదయగిరి రోడ్డులోని క్రీడల శాఖకు సంబంధించిన మైదానాన్ని పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా జేసీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 12న కావలిలో సీఎం పర్యటించి చుక్కల భూముల రైతులకు సంబంధించిన పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తద్వారా జిల్లాలో సుమారు 25 వేల మంది రైతులకు సంబంధించిన 47 వేల ఎకరాల భూములు నిషేధిత జాబితా నుంచి బయటపడనున్నాయని వివరించారు. కలెక్టర్, ఎస్పీ మరోమారు ఏర్పాటన్లు పరిశీలించి తుదినిర్ణయం తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారిణి టి.సౌజన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 12 ప్రాజెక్ట్‌ల పరిధిలో 11 అంగన్‌వాడీ కార్యకర్తలు, 2 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 55 అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ నెల 3 నుంచి 9వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వివాహితలు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులకు త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

పెన్షనర్ల ఈకేవైసీ గడువు 9 వరకు పెంపు

నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ఈకేవైసీ గడువును ఈ నెల 9వ తేదీ వరకు పొడిగించినట్లు స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌ఎం గౌస్, ఎస్వీఎన్ మూర్తి మంగళవారం తెలిపారు. గతంలో మే 6వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలని పెన్షనర్లకు తెలిపారని, గడువు సరిపోదంటూ మంగళవారం జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జిల్లా ట్రెజరీ, అకౌంట్స్ అధికారితో సమావేశం నిర్వహించి పరిస్థితులను వివరించగా గడువు పెంచి నెల్లూరు నగర పరిధిలో 7 ప్రాంతాల్లో పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకునేలా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగరంలో 12 వేల మంది పెన్షనర్లు ఉండగా ఇప్పటివరకు 4 వేల మంది మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నట్లు తెలిపారు.

సరికొత్త సాగు

వ్యవసాయ శాఖ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అదే గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్. వివిధ కారణాలతో రైతులు పంట దిగుబడులు సాధించలేకపోతున్నారని అధికారుల భావన. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంపొందించుకుని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలతో తక్కువ వ్యయంతో ఎక్కువ దిగుబడిని సాధించేందుకు ఈ కార్యక్రమాన్ని పొదలకూరు మండలంలో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. తొలి ప్రయత్నం విజయవంతమైంది.

- రబీలో ప్రయోగాత్మకంగా గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్
- పొదలకూరు మండలంలో 250 ఎకరాల్లో..
- తొలి ప్రయత్నం సక్సెస్
- ఆధునిక పద్ధతులతో తగ్గిన ఖర్చులు



గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్‌లో దుగ్గుంట ఆర్బీకేలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ, ఏఓ (ఫైల్)

పొదలకూరు: శాస్త్రీయ పద్ధతుల్లో సాగుకు ఊతం ఇస్తూ మండలంలోని దుగ్గుంట పంచాయతీలో రబీ సీజన్లో చేపట్టిన వరిసాగు ఆశించిన స్థాయిలో దిగుబడినిచ్చింది. వ్యవసాయ ఖర్చులు కూడా ఎకరాకు రూ.4 నుంచి రూ.6 వేలు తగ్గాయి. అయితే రైతులు అకాల వర్షం, ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పండించిన ధాన్యాన్ని ల్యాబ్ పరీక్షలకు పంపించకుండానే అమ్ముకున్నారు. ధరలు సైతం గిట్టుబాటు కంటే 20 శాతం అదనంగా వచ్చినట్లు వెల్లడయింది. ఈ పంచాయతీ వ్యవసాయాధికారుల పర్యవేక్షణలో జిల్లాలోనే ప్రథమంగా గుడ్‌అగ్రికల్చర్ ప్రాక్టీస్ (మేలైన వ్యవసాయ పద్ధతుల)కు ఎంపిక కావడం విశేషం. ఆర్గానిక్ కార్బన్ శాతాన్ని పెంపొందించుకుని పండించిన ధాన్యంలో విష పదార్థాల శాతాన్ని తగ్గించి దిగుబడైన పంటను ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి మేలైన వ్యవసాయ సాగు పద్ధతుల వల్ల కలిగే ప్రయోజనాలను మిగిలిన రైతులకు వివరించేందుకు గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్‌ను అమలు చేస్తున్నారు.

మొత్తం 250 ఎకరాలు

గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్‌కు మండలంలోని దుగ్గుంట పంచాయతీలో రామాపురం, దుగ్గుంటరాజుపాళెం, కొనగలూరు, ఊట్లపాళెం గ్రామాల నుంచి సుమారు 100 మంది రైతులను వ్యవసాయ శాఖ అధికారులు ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో రబీ సీజన్లో 250 ఎకరాల్లో వరి సాగు చేయించారు. పంటల సాగులో ఆర్గానిక్ శాతాన్ని పెంపొందించి విష తుల్యతను తగ్గించేందుకు శాస్త్రవేత్తలు, అధికారులు తరచూ పరిశీలిస్తూ సలహాలు, సూచనలు ఇచ్చారు. గతంలో రైతులు చేపట్టే యాజమాన్య పద్ధతులకు భిన్నంగా ఎరువులు, సాగునీటి వాడకాన్ని తగ్గించారు. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలోనే ఎరువులను వినియోగించారు.

ఫలితాలిలా..



ధాన్యాన్ని తరలిస్తున్న రైతులు

గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్‌లో భాగంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల ప్రయత్నం ఫలించింది. రైతులు సమతుల్యంలో యూరియా వాడకం, ప్రకృతి వ్యవసాయం చేపట్టడంతో ఎకరాకు 4 పుట్ల ధాన్యం దిగుబడి వచ్చింది. అంతే కాకుండా ఎకరాకు సాధారణంగా రూ.28 నుంచి రూ.30 వేలు వ్యవసాయ ఖర్చులు అవుతాయి. గుడ్ అగ్రికల్చర్‌లో భాగంగా రూ.24 వేలు మాత్రమే ఖర్చులు అయినట్లు రైతులు వెల్లడించారు. ఇందువల్ల వరి ధాన్యం ద్వారా అదనంగా ఇక్కడి రైతులకు ఎకరాకు రూ.4 నుంచి రూ.6 వేల వరకు ఖర్చులు మిగిలాయి. ఇదే తరహా వ్యవసాయాన్ని కొనసాగిస్తామని రైతులు చెబుతున్నారు. ఇక్కడి రైతులంతా దాదాపుగా ఆర్‌ఎన్ఆర్ 15048 (తెలంగాణ మసూరి) రకం సాగు చేపట్టారు. ఫలితంగా ఊహించని విధంగా ధరలు గిట్టుబాటయ్యాయి.

ఈ పద్ధతి బాగుంది



గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్‌లో వరిసాగు వల్ల దిగుబడి తగ్గలేదు. యూరియా, కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గిస్తే దిగుబడి తగ్గుతుందని ఆందోళన ఉన్నా అలాంటిది జరగలేదు. వ్యవసాయాధికారులు సలహాలు, సూచనలు పాటించాం. ఈ సాగులో ఆర్గానిక్ కార్బన్ పెరిగి విషతుల్యమైన పదార్థాల శాతం తగ్గినట్లుగా భావిస్తున్నాం.

– కె.రామిరెడ్డి, రైతు, ఎంపీటీసీ సభ్యుడు, కొనగలూరు

మరో పంచాయతీని ఎంపిక చేస్తాం



గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్‌లో పండించిన ధాన్యాన్ని ల్యాబ్‌కు పంపలేకపోయాం. రైతులు అకాల వర్షం కారణంగా ధాన్యాన్ని వెంటనే విక్రయించేశారు. ఫలితంగా ల్యాబ్‌కు పంపి నివేదిక వచ్చే వరకు ధాన్యాన్ని నిల్వ చేయడం వీలుపడలేదు. వచ్చే రబీలో మరో పంచాయతీని ఎంపిక చేసి ల్యాబ్ పరీక్షలకు పంపుతాం. దిగుబడి, ధరల గిట్టుబాటు గుడ్ అగ్రికల్చర్‌లో బాగుంది.

– ఎ.వాసు, ఏఓ, పొదలకూరు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం



గోపి మృతదేహం

ఆత్మకూరు: బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఎస్సై ఎం.శివశంకర్‌రావు వివరాల మేరకు మహిమలూరుకు చెందిన రైతు దేవరపాటి బ్రహ్మయ్య కుమారుడు గోపి(34) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. వివాహితుడైన ఇతడు ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. తన మిత్రుడు, గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీతో కలిసి మంగళవారం కారులో ఆత్మకూరుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా నువ్వూరుపాడు సమీపంలో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న గోపి రోడ్డుపై పడిపోయి తలకు తీవ్రగాయమై స్పృహ కోల్పోయాడు. సమీపంలో ఉన్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా గోపి అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆర్‌ఎంపీకి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గోపి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

శాస్త్రోక్తంగా మహా కుంభాభిషేక పూజలు



యాగశాల వేదిక పూజలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి దంపతులు



పూజా కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో మహా కుంభాభిషేక వేడుకలను మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన యాగశాల వేదిక పూజలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి – ప్రశాంతిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం జప హోమం, మూడో కాలపూజ, పూర్ణాహుతి, తత్వ హోమం, యాగశాల పూజ, నాలుగో కాల పూజ, లఘు పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కంచి పీఠాధిపతి పర్యవేక్షణ

మహాకుంభాభిషేక పూజలను కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి ఆశీస్సులను తీసుకున్నారు.

నేడు కుంభాభిషేక మహోత్సవం

బుధవారం వేకువజామున 4 గంటల నుంచే మహా కుంభాభిషేక వేడుకలను నిర్వహించనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీస్ బందోబస్తుతోపాటు అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి – ప్రశాంతిరెడ్డి దంపతులు, హైద్రాబాద్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కొలన్ రాజారెడ్డి – పూజితారెడ్డి దంపతులు వ్యవహరిస్తున్నారు. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

బోల్తా పడిన సిమెంట్ ట్యాంకర్

- ఆరు క్రేన్లతో యథాస్థితికి..



జాతీయ రహదారి పక్కన బోల్తా పడిన సిమెంట్ ట్యాంకర్

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): డ్రైవర్ నిద్రమత్తు కారణంగా 67వ నంబర్ జాతీయ రహదారిపై కృష్ణపట్నం పోర్టు నుంచి ప్రొద్దుటూరుకు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ మర్రిపాడు మండలం కోనసముద్రం జంక్షన్‌కు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ తలకు స్వల్పగాయాలు కాగా ఆత్మ కూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. అయితే బోల్తాపడిన ట్యాంకర్‌ను యథాస్థితికి తీసుకురావడానికి తొలుత రెండు క్రేన్లు వినియోగించినా ఫలితం లేకపోయింది. చివరికి 6 క్రేన్లను వినియోగించి సాయంత్రం 6 గంటల సమయంలో ఎట్టకేలకు సిమెంటు ట్యాంకర్‌ను పైకిలేపి యథాస్థితికి తీసుకువచ్చారు. డీసీపల్లి టోల్‌ప్లాజా వద్దకు తరలించారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మొగళ్లూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: కుటుంబంలో ఉద్యోగం ఉన్న పిల్లలు వేరుగా ఉన్నా, సంక్షేమ పథకాలు అందని అర్హులైన వారి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎడిట్ ఆప్షన్ ద్వారా ప్రభుత్వ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మొగళ్లూరు సచివాల యం పరిధిలో గురవాయపాళెం, మొగళ్లూరు గ్రామాల్లో రెండో రోజు మంగళవారం మంత్రి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురవాయపాళెంలో మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం వీఆర్వోలకు ఎడిట్ ఆప్షన్‌ను ఇచ్చిందన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదని సీఎం మంచి ఆలోచనతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు అందుతూ రద్దు అయి ఉంటే ఎడిట్ ఆప్షన్ ద్వా రా తిరిగి పథకాలను పొందేందుకు అవకాశం ఉందన్నారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు ఇందుకోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రారంభోత్సవాలు

గురవాయపాళెంలో రూ.84 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, వాటర్ ట్యాంక్‌లను, మొగళ్లూరులో రూ.1.17 కోట్లతో నిర్మించిన సచివాలయ భవనం, సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్లను మంత్రి కాకాణి ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ ఆకుల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చెన్నూరు విజయలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు వై.పెంచలరెడ్డి, వై.చినపెంచలరెడ్డి, ఎస్.రమేష్‌నాయుడు, మోహన్‌నాయుడు, మాల్యాద్రి, వై.శ్రీనివాసులురెడ్డి, ఆకుల గంగిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా దిగుమతికి సన్నాహం

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు ద్వారా యూరియా దిగుమతి జరుగుతుందని పోర్టు ఉన్నతోద్యోగి ఒకరు మంగళవారం తెలిపారు. టెలెరి ఎం అనే నౌక 50.154 టన్నుల యూరియా దిగుమతి చేసేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. మరో వైపు జిన్ హాంగ్ అనే నౌక ద్వారా 1.61 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి జరుగుతోందని తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 126
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 244
లేయర్ చికెన్	: 136

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.72
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.22

నెల్లూరు టు తిరుపతికి విద్యుత్ బస్సులు



నెల్లూరు ఆర్టీసీ డిపోలో విద్యుత్ బస్సులు

నెల్లూరు – తిరుపతి మధ్య విద్యుత్ బస్సులు త్వరలో పరుగులు తీయనున్నాయి. ఈ నెల 4వ తేదీ నుంచి అధికారులు వీటిని ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం 12 విద్యుత్ బస్సులను అధికారులు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ బస్సు ఒకసారి చార్జింగ్ చేస్తే సుమారు 180 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. వీటి కోసం నెల్లూరు ఆర్టీసీ డిపోలో ప్రత్యేకంగా చార్జింగ్ పాయింట్‌లను కూడా ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



డిపోలో ఏర్పాటు చేసిన చార్జింగ్ పాయింట్లు